# ఎవర్ని నమ్ముకోవాలి?

మూడు రోజులు వరుసగా ముసురు పట్టి ఆ మధ్యాహ్నమే వదిలింది. ఫెళ్ళున ఎండ కాసింది. అంతలో [illegible] మునిగి పోయినట్లు సూర్యుడు మూటా-ముల్లీ సర్దేసుకుంటున్నాడు ఎండలో చురుకుదనం పస్తులున్న వాడి వంట్లో శక్తిలాగా క్షీణించిపోతుంది.....

సిమ్మాద్రి పాక హోటలు ముందు ఎల్లయ్య దీనంగా నిలబడి వున్నాడు. జాలిగా చూస్తున్నాడు.

సిమ్మాద్రి జోరుగా టీ కలుపుతూ, "రోజూ రాత్తిరి కిత్తా, రాతిరికిత్తా అంటూ ముణ్ణాళ్ళ మట్టీ అప్పు తినిపోతున్నావ్. ముందు బాకీవున్న ఆ ఎనభయి పైఛలు రానీయ్ - అప్పుడు దరిజాగా బన్‌తిని ఠాంగ్ టీ త్రాగు." అంటూ కసిరికొట్టాడు.

ఎల్లయ్యకు కళ్లు తిరుగుతున్నాయి. నీరసంతో కాళ్ళు గుంజుకుపోతున్నాయి. మూడురోజుల్నించి పస్తు. ఉత్త టీ చుక్కలతో కడుపు నింపుకుంటున్నాడు. ఈ పూట ఆ టీ చుక్కలు కూడా రాల్చనంటున్నాడు సిమ్మాద్రి.

ఇక లాభం లేదనుకొని మురికి లాగు జేబులోంచి అయిదు పైసల బిళ్ళ బయటికి తీసి 'ఠాంగ్' టీ ఇమ్మన్నాడు.

"ఆ అయిదు పైఛలకు జీడీముక్క కూడా రాదు. ఠాంగ్‌టీ ఎట్టొత్తదిరా ఎర్రి నాకొడకా!" సిమ్మాద్రి ఈసడించుకున్నాడు.

వచ్చినన్నే పోయమని ఆకలితో సోష వస్తూందని ఎంతగానో బ్రతిమాలుకున్నాడు. చివరికి సిమ్మాద్రి కనికరించి ఆ అయిదు పైసలు తీసికొని అసలే లొడితెడున్న గ్లాసు కడుగున ఇన్ని టీ నీళ్ళు పోసి యిచ్చాడు.

ఆ కడుగు నీళ్ళే అమృతంగా భావిస్తూ ఎంతో ఆబగా ఆర్చుకొని ఆర్చుకొని త్రాగాడు.

కడుపులో ఆ వేడి టీ చుక్కలు పడేసరికి ఎల్లయ్యకు కాస్త వోపికా మరికాస్త 'వుశేరూ' వచ్చాయి.

తలకు చుట్టుకున్న మురికి గుడ్డను విప్పి గట్టిగా దులిపి భుజాన వేసుకున్నాడు. రోడ్డు ప్రక్కన, పేవ్‌మెంట్ మీద వున్న జువ్వి చెట్టు దగ్గరకెళ్ళి అంతవరకు చేతిలో వున్న మురికి సంచిని చెట్టు మొగదల్లో పెట్టాడు. పైగుడ్డతో రోడ్డువార పది గజాల మేర శుభ్రపరిచాడు. తర్వాత ఆ సంచిలో నుంచి ఒక చిన్న మూటను బయటకి తీశాడు. మెల్లగా విప్పాడు. అందులో బొగ్గుముక్కలూ, రంగు సుద్ద ముద్ద ముక్కలూ, ఇటికబెద్దలూ వున్నాయి.

ఒక బొగ్గు ముక్కను చేతిలో పట్టుకొని రోడ్డుమీద గొంతుక్కూర్చున్నాడు. కొన్ని క్షణాలు కళ్ళు మూసుకొని తనకీ విద్యను నేర్పిన తన తండ్రినీ, తమ యిష్టదైవమైన వేంకటేశ్వర స్వామినీ మనస్సులో స్మరించుకున్నాడు. ఆ తర్వాత ఆ బొగ్గు ముక్కతో రోడ్డు మీద చకచకా బొమ్మ వేయసాగాడు.

ఎల్లయ్య చెయ్యి ఎంతో చురుగ్గా, ఎంతో లాఘవంగా కదులుతూంది. ఎంతో ఏకాగ్రతతో ఏడుకొండలవాడి బొమ్మను చక్కగా చెకచెకా గీస్తున్నాడు.

మూడు రోజుల్నుంచీ పస్తులతో నీరసించిపోయినా ఆ బొమ్మ గీస్తున్నంత సేపు అతనిలో ఏదో వుత్సాహం వురకలేస్తూంది. అంతర్లీనమైన ఏదో నిగూఢ శక్తి పొంగుతూంది.

రోడ్డుమీద పోయే జనం అక్కడ ఒక్కక్షణం ఆగి అతను గీస్తున్న బొమ్మవయిపోసారి చూచి మరీ పోతున్నారు.

ప్రొద్దు పూర్తిగా కుంకుతూంది....

రైలు స్టేషను వెనుక వయిపు నున్న గుడిశల్లోంచి కనకాలు తక్కుతూ తారుతూ ఎల్లయ్య దగ్గర కొచ్చింది.

"ఎల్లియ్యా, ఇయ్యాళ ఏ బొమ్మేత్తొన్నావ్?" అంది.

తల ఎత్తి చూచి మళ్ళీ బొమ్మ గీయసాగాడు. అతనికి వండిమీద చొక్కా కూడా లేదు. భుజానేసుకున్న ఆ మురికి గుడ్డ తప్ప. వేసుకున్న కాకి నిక్కరు నల్లగా మాసిపోయి వుంది. గడ్డమూ, మీసాలూ పెరిగివున్నాయి. బురద కొట్టుకుపోయిన నల్లరాయి లాగా వున్నాడు. అయినా అతని చేతిలోంచి - ఆ బొగ్గు ముక్కల్లోంచి ఏడుకొండలవాడి దివ్య మంగళ విగ్రహం అది అందంగా రూపు దిద్దుకుంటూంది.

ఈ ఎర్రి ఎల్లయ్యలో ఇంత ఇద్దె వుందా? అని తనలో తాను ఆశ్చర్యపోయింది కనకాలు.

పైకి, "గీయ్ ఎల్లియ, గీయ్" వెటకారంగా అని సిమ్మాద్రి పాక హోటలుకేసి నడిచింది.

బన్ రొట్టె తిని, తాంగ్ టీ త్రాగి సత్తార్ బడ్డీకొట్టు దగ్గరకెళ్ళింది.

సత్తార్ మొగం కనకాల్ను చూడగానే పీర్లపండుగ నాడు పంజా లాగా కళకళలాడిపోయింది. "ఈరోజు బేగొచ్చేశావే?" అంటూ ఇకిలించాడు.

"బేగి సీకటడితే బేగే వొత్తా!" అంటూ బుగ్గమీద ఒక పోటు పొడిచి అతడిచ్చిన జర్దాకిళ్ళీ నోట్లో కుక్కుకుని మళ్ళీఎల్లయ్య దగ్గరకొచ్చింది.

"బొమ్మ పూర్తయిందట్టుందే!" అంటూ పేవ్‌మెంట్ అంచున కూర్చుంది.

ఎల్లయ్య రంగు సుద్దలతో నగిషీలు పెట్టుతున్నాడు. అప్పటికే బాగా చీకటి పడిపోయింది. వీధి దీపాలు వెలిగాయి. జువ్వి చెట్టు కొమ్మల నీడ స్వామికి గొడుగు పట్టింది. స్వామి కళకళలాడిపోతున్నాడు.

పూర్తయిన బొమ్మను చూచుకొని ఎల్లయ్య తృప్తిగా గుండెల నిండా గాలి పీల్చుకున్నాడు. ఏదో గర్వం ఒక త్రుటికాలం అతని కన్నుల్లో లీలగా తొంగి చూచింది. ఆ తృప్తి, ఆ గర్వమూ ఆకలికీ లేమికీ అతీతమైనది.

తుది మెరుగులు దిద్దుతూన్న ఎల్లయ్యతో వెటకారంగా "మొత్తానికి ఆ ఏడుకొండల మీద నుంచి నీ దేముడ్ని కిందకు దింపుకొచ్చావు ఎల్లియ్యా!" అంది.

ఇంతలో జాజిపూల బుట్టను చేతికి తగిలించుకొనిపోతున్న సాయిల్ను, "ఈడ మడుసులున్నారు సూసుకో!" అని పిలిచి మూడు మూరల పూలు కొంది.

పూలు తలలో తురుముకోబోతూంటే ఎల్లయ్య, "మా దేవుడికి నాల్గు పూలిత్తావా కనకాలూ! అని అర్థించాడు.

"ఊఁ-" అంటూ మూల్గి దండలోంచి కాసిని పూలు దూసి యిచ్చింది.

కనకాలు యిచ్చిన పూలను తన దేముడు మీద అక్కడొకటి ఇక్కడొకటి సుతారంగా చల్లుతూ స్వామిని కంటినిండుగా మురిపెంగా చూచుకుంటున్నాడు.

పూలచెండు భుజం మీదకు పడేటట్టుగా సవరం జడను ముందుకు లాక్కొని దాన్ని మురిపెంగా చూచుకుంటూ "సల్లు సల్లూ! నీ దేముడు నీ కడుపు సక్కంగా నింపుతాడు..." ఎక్కిరింతగా అంది.

"నింపకేంటే-"

"ఆకలితో నింపాల్సిందే! మూణ్ణాళ్ళ మట్టీ పత్తులుంటున్నావుగా!"

ముసురు మూలంగా మూడ్రోజుల్నుంచి ఎల్లయ్య బొమ్మలు గీయటం లేదు.

కనకాలుకు సమాధానం చెప్పకుండా తన మురికి సంచిలో దేనికోసమో వెతుకుతున్నాడు.

"ఓరెల్లయ్యో, నీకింకా తెల్దేమో గాని దేవుడ్ని నమ్ముకున్నోడు వోడూ బాగుపడలా! మట్టికరుసుకు పోటమే!" కిసకిసా నవ్వుతూంది.

ఎల్లయ్య సంచిలోంచి ఒక చిన్న పొట్లం బయటికి తీశాడు. అది తళుకు పొడి పొట్లం. అందులో కాగితాని కంటుకొని కాస్త పొడి వుంది. ఎప్పుడో నెలరోజుల నాడు కొన్నది. అదే మిగిలింది. దాన్నే వేలికొసతో శంఖుచక్రాలమీద, కిరీటం మీదా అలాగ్గా అద్దాడు.

ఏడుకొండలవాడు వజ్రకిరీటంలో వైఢూర్యాలూ మణులూ పొదిగిన శంఖు చక్రాలతో ధగధగలాడిపోతున్నాడు.

ఎల్లయ్య క్రింద పారేసిన కాగితాన్ని తీసుకొని, "దీంట్లో ఏముంది నా సేర్థం!" అంటూ దాన్ని తన బుగ్గలకేసి రుద్దుకుంది.

నల్లటి బుగ్గల నునుపుల్లో తళుకులతో కనకాలు మొగం వింతగా మెరిసిపోతుంది.

మురికి సంచిలోంచి దీపం డబ్బాను బయటికి తీశాడు. దాన్ని చెవుదగ్గర పెట్టుకుని వూగించాడు. అందులో అడుగున ఎక్కడో కాస్త కిర్సనాయిలుంది. కిర్సనాయిలు కొనడానికి దాచుకున్న అయిదు పైసలు టీ నీళ్ళ కోసం ఆ సిమ్మాద్రి గాడి మొగాన కొట్టాడు. ఇదెంత సేపు వెలుగుతుందో ఏటో?

కనకాలు దగ్గర అగ్గిపెట్టె తీసికొని దీపం వెలిగించే సన్నాహంలో వున్నాడు.

స్టేషన్లో రైలు కూత వినిపించింది. పల్నాడు నుంచి వచ్చే ప్యాసింజెరుబండి వచ్చినట్లుంది. కనకాలు కంగారుగా లేచి నిలబడి చీర దులుపుకుంది. రొమ్ములు కనబడేటట్లు పమిటను జార్చుక ., జుట్టూ, పూలూ సవరించుకుంది.

ఎల్లయ్య దీపం బుడ్డి వెలిగించి బొమ్మ మధ్యలో పెట్టాడు. చేతులు మోడ్చి మనస్సులో దేముడ్ని ధ్యానించాడు. బుడ్డి దీపం వెలుగులో ఏడుకొండలవాడు ధగధగలాడిపోతూ చిద్విలాసంగా చిరునగవులు చిందిస్తున్నాడు.

కనకాలు జువ్విచెట్టు క్రీనీడలో తారట్లాడుతుంది.

పుణ్యం వెలుగునూ, పాపం చీకటినీ ఆశ్రయిస్తుందన్న మాట నిజం.

ఇద్దరూ రైలు దిగి వచ్చే ప్యాసింజర్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

కనీసం ఒక రూపాయి డబ్బులన్నా పడితే ఈ పూటన్నా కడుపులోకి ఇంత తినవచ్చు ననుకుంటున్నాడు ఎల్లయ్య.

రోడ్డుమీద పోయే జనం ఎల్లయ్య గీసిన బొమ్మ దగ్గర ఆగి చూస్తూన్నారు. మరుక్షణమే వాళ్ళ చూపులు జువ్విచెట్టు వయిపుకు పోతూన్నాయి.

ఎవరో ఒకరూ - అరా ధర్మాత్ములు భక్తిభావంతో పైసలు వేస్తోన్నారు. చాలమంది కేవలం క్రీనీడలో తారట్లాడే కనకాన్ని చూస్తానికే బొమ్మదగ్గర ఆగుతున్నారు.

"ఈ కనకాలు ముండ నా పేణానికి ఎక్కడ తగలడ్డదంటా!" మనస్సులో విసుక్కున్నాడు ఎల్లయ్య.

రోడ్డు మీద జనం కొద్దిగా పలచబడటం చూచి కనకాలు విసుగ్గా మళ్ళీ ఎల్లయ్య దగ్గర కొచ్చింది.

"నీకు డబ్బులు పడ్డయట్టుందే?" అంది.

బొమ్మ మీద మూడు అయిదుపైసలు బిళ్ళలున్నాయి.

"ఓరెల్లిగా నీకియ్యాళ ఆపదేను పైఛలే....." అంది కిసకిసా నవ్వుతూ. ఏం అన్నట్లు చూశాడు.

"పైన సూర్డా సున్నం పిడత మొగమోడా!" అంది.

ఆకాశంలో నల్లబి మబ్బులు ఒకదాన్నొకటి పడద్రోసుకొంస్తూన్నాయి. చల్లటిగాలి తెరలుతెరలుగా వీస్తూంది.

ఎల్లయ్య బిక్కమొగం వేశాడు. అసలికే నల్లటి మొగం దిగులుతో మబ్బుకప్పేసింది.

ఆ గాలికి బుడ్డి దీపంగిజగిజ లాడింది - అతని మనస్సులాగా.

మబ్బులు చూచి కనకాలు వుషారుగా కేరింతలు కొట్టింది అడవి నెమలి లాగా, వర్షం పడితే తనకు గిరాకి.

ఈ మూడ్రోజుల ముసురు ఎల్లయ్య నోట్లో దుమ్ముకొట్టింది; కనకాలుకు పండుగ చేసింది. ముసురుకు ఎల్లయ్య కడుపులో ఆకలి చిచ్చు రేగితో, కనకాలు బుగ్గన జర్దాకిళ్ళీ చేరింది. ఇంతలో రప్పు రప్పుమంట లావు చినుకులు పడడం మొదలు పెట్టాయి.

"ఓ రెల్లిగా, నీ దేముడు గోవిందా-గోవిందా" అంటూ పరిహాసంగా చప్పట్లు కొట్టింది. కనకాలుకు చప్పట్లు. ఎల్లయ్య గుండెట్లో సమ్మెట్లూ. లావు చినుకు సన్న చినుకయింది..... పిచ్చి ఎల్లయ్య తన దేముడు తడవకుండా తనపై గుడ్డ అడ్డుపట్టాడు.

కనకాలు తన వళ్ళు తడవటానికి పమిట చెంగును బార్లా తీసేసి చేత్తో పట్టుకుంది, "ఆరేసుకోబోయి పారేసుకున్నాను" అని కూనిరాగం తీస్తూ.

చినుకూ చినుకూ కలిసి తుప్పర వానయింది. వాన జోరయింది....

వానల్లో ఎల్లయ్య పూర్తిగా తడిచిపోయాడు. ఎల్లయ్య దేముడూ పూర్తిగా తడిచిపోయాడు - రోడ్డు వాలులో కొట్టుకొస్తూన్న నీటి జాలులో స్వామి "తెప్ప వుత్సవం" ఆడాడు. స్వామి కిరీటంలోని వజ్రాలూ, శంఖుచక్రాలలోని మణులూ వైడూర్యాలూ నీళ్లల్లో కొట్టుకుపోయాయి. వానచినుకులు సెటిల్మెంటు దొంగల్లాగా స్వామిని నిలువు దోపిడి చేశాయి. చిద్విలాసం చెరిగిపోయింది. చిర్నగవు కరిగి పోయింది. దేముడు వెలవెల బోయాడు. అందచందాలన్ని కొట్టుకుపోయాయి.

వానలో కనకాలు కూడా పూర్తిగా తడిచి పోయింది. తడిచిన శరీరంలోంచి క్రొత్త అందాలు తొంగిచూశాయి. వాన, కనకాలుకు సొంపులూ- వంపులూ అనే "సొమ్ములు" కట్టబెట్టింది.

రోడ్డు మీదజనం దుకాణాల చూరులు క్రిందకూ, హోటళ్ళ పంచల్లోకీ, బడ్డీకొట్టుల టాపుల క్రిందకీ పరుగెత్తారు......

మొగాళ్ళ మధ్యలోకి తడిచిన గుడ్డలతో, పొడుచుకొచ్చే అందాలతో, పాట మరించిన వంపుసొంపులతో, వంటి నిగనిగలతో కనకాలు వెళ్ళి కులుకుతూ నిలబడింది.

- ఆకలి చూపులు ఆమె చుట్టూ వెచ్చటి చలిమంటలు వేశాయి.

ఎల్లయ్య ఆ ప్రక్కనే ఒక మూలగా మునగదీసుకొని కూర్చున్నాడు. అతని గుప్పిట్లో మూడు అయిదు పైసల బిల్లలూ గుండెల్లో పొర్లుకొచ్చే ఏడ్పూ, మనసు నిండా దిగులూ, వంట్లో నీరసమూ, కడుపులో ఆకలి వున్నాయి.

రోడ్డు మీద ఖాళీగా పోతున్న ఒక రిక్షాను పిలిచి కనకాలూ, మరోమొగాడూ ఎక్కి ఎక్కడికో పోయారు.

......... మొదటాట సినిమా వదిలాక వాన వదిలింది.

ఎల్లయ్య కాళ్ళీడ్చుకుంటూ మళ్ళీ తన దేముడు దగ్గరకొచ్చాడు.

ఎప్పుడో ఏదో బొమ్మ గీసినట్లు చారికలు మాత్రం మిగిలివున్నాయి - స్వామి ఏకాంత సేవలో వుంటే వరదా దింపినట్లు!

"ఇయ్యాళ కూడా పత్తే పడుకోబెట్టుతున్నావుకదు సావీ కానీయ్-" విరక్తిగా నవ్వుకున్నాడు.

ఇంతలో తనవెనుక కిలకిలా నవ్వు వినిపించే సరికి వెనక్కి తిరిగి చూశాడు.

కనకాలు!

"నీ దేముడు మళ్ళీ ఏడుకొండలు మీద కెగిరిపోయాడా ఎల్లయ్యా!" అంటూ మేలమాడింది.

ఎల్లయ్య మాట్లాడలేదు. దిగాలుబడి కూర్చున్నాడు.

"సుబ్బరంగా నాకు "బోకరు"గా వుండమంటే వినుకోవు. నా దేముడోయ్ నా బొమ్మలో అంటూ ఏడుత్తావు! సూడు నీ దేముడు నిన్నేం చేశాడో!" అంది.

ఏం చేశాడు? పస్తులు పండబెట్టాడు. ఈ బొమ్మలు గీస్తే కూటికి వచ్చేనా గుడ్డకొచ్చేనా? మొలకు గుడ్డ కట్టుకున్నప్పన్నుంచీ గీస్తున్నాడు. ఈ "ఇద్దె" తనకేం వరగపెట్టింది. ఆ మొల గుడ్డే మిగిలింది. వంటికి చొక్కా గుడ్డయినా లేదు. పూటకు టికానాలేదు. ఆ అరుగుమీదా ఈ అరుగుమీదా పడుకోటమే! నాదీ అంటూ తల మీద ఇంత గూడులేదు. ఈ పూటకు ఎలా అని దేవుళ్ళాడుకోవటమే...

ఎల్లయ్య ఆలోచనలో పడటం చూసి మనిషి మెత్తబడుతున్నాడనుకొని కనకాలు మళ్ళీ ఇలా అంది

'నేనే బేరాలు సూసుకుంటే మరీ "సీపు" రేటు పడుతూంది. అదే ఒక బోకరుండి, 'ఏవండి, ఒక సిల్ల వుందండి' అని పిలుత్తే ఎంత క్లాసుగా, గిరాగ్గా వుంటుందో తెల్సా?" అంది.

"రేపుటాలనుంచి ఈ బొమ్మలు మానేత్తానే! నీవు సెప్పినట్లే సేత్తానే కనకాలు!" ఏదో నిర్ణయించుకున్నట్లు అన్నాడు.

"అద్గది, అట్టుండాల. సరే ఆకలితో ఏం సత్తావుగాని, ఇంద ఈ పావలా కాసట్టుకెళ్ళి ఏవఁన్నా తినిరా!" అటూ రొంటిన దోపుకున్న చిల్లర డబ్బులు తీసింది.

ఆ రాత్రి అంజమ్మ అరటికొట్టు బల్ల క్రింద మునగదీసుకొని కునుకుతీస్తున్న ఎల్లయ్యకు ఒక కల వచ్చింది. కలలో తన అయ్య కనిపించి, "సీ. నా కడుపున సెడబుట్టావు కదరా!" అన్నాడు.

వులిక్కిపడి లేచి కూర్చున్నాడు..... ఎప్పుడో పదేళ్ళనాడు చనిపోయిన అయ్య ఇయ్యాళ కలలోకి నచ్చాడేంటీ! ఇట్టా అన్నాడేంటి? తను ఇద్దె మానేసి- ఆ కనకాలుకు "బోకరు"గా వుండటం అయ్యకిష్టం లేదన్నమాట. అయ్య చనిపోతూ తమ నల్గురననదమ్ముల్నీ పిలిచి, "ఒరేయ్, ఇది మనకు ఆదేముడిచ్చిన ఇద్దిరా! దీన్ని వదలమాకండిరా! ఆ దేముడ్ని నమ్ముకోండిరా!" అని చెప్పాడు. తన ముగ్గురన్నలు మూడు వూళ్ళల్లో ఈ 'ఇద్దెనే నమ్ముకొని పొట్టపోసుకుంటున్నారు. వాళ్ళు ఏడుకొండలవాడ్నీ, ఆంజనేయ స్వామినీ, ఏసుదేవుడ్నీ, దుర్గమ్మ తల్లినీ ఇట్లా ఎన్నో దేముళ్ళ బొమ్మలు గీసి వాట్ని చూపించి డబ్బులడుక్కుంటూంటే తను ఈ కనకాల్ను చూపించి డబ్బులడుక్కుంటాడా? సీసీ పత్తుల్లో సావనన్నా సత్తాడుగానీ ఇట్టాంటి నీసికం పనిసెయ్యడు.

మర్నాడు కనకాలుతో నీకు "బోకరు"గా వుండనే అని చెప్పాడు.

"పోరా సెపలసిత్తపోడా! ఆ దేముడు పెట్టతాడ్లే కంకీ-" అని ఎద్దేవ చేసింది.

మళ్ళా మధ్యాహ్నం నుంచి ఫెళ్లున ఎండ కాసింది. మళ్ళీ ఏడుకొండలవాడి బొమ్మ గీశాడు. ఈ రోజు శనివారం అవడం వల్లనో ఏమో డబ్బులు బాగానే పడ్డాయి. ప్లేటు భోజనం చేశాడు. ఉక్కపోతగా ఉంటే పేవ్‌మెంట్‌మీద తమ బొమ్మ పక్కగా పడుకున్నాడు.

ఒక రాత్రికడా మెలకువవచ్చి చూచేసరికి దేముడు కాళ్ళమీద కనకాలు కుప్పలాగా పడి వుంది. దాని జుట్టంతా విడిపోయి చిందరవందరగా చుట్టూపడి వుంది.... చీకటి మడుగులాగా! వంటిమీద సరిగ్గా గుడ్డ కూడ లేదు.

కంగారుగా లేచాడు. దాని వళ్ళు సలసలా కాలిపోతూంది. సన్నగా మూలుగుతూంది.

స్టేషన్ వయిపు పరుగెత్తాడు. వేడి వేడి కాఫీ తీసికొచ్చి కనకాల్ను లేపి కూర్చోబెట్టి త్రాగించాడు. వంటిమీద గుడ్డసర్దాడు, జుట్టు ముడేశాడు. ఎన్నో వుపచారాలు చేశాడు. నీరసంగా మూల్గింది. దీనంగా చెప్పింది.

సందకాడ ఎవడో వచ్చి మంచిబేరం వుందని వూరు బయటున్న పాడుబడ్డ సత్రం దగ్గరకు తీసుకెళ్ళాడు. అక్కడ మరో ముగ్గురున్నారు. నలుగురూ కలసి మీదబడ్డారు. రకరకాల బూతుపనులు చేశారు, చేయించారు. నానా చిత్రహింసలూ పెట్టారు. చివరికి ఒక్క పైసా కూడ ఇవ్వకుండా ఎవరి దార్ని వాళ్ళుపోయారు. అంతదూరం ఆ స్థితిలో నడుచుకుంటూ వచ్చి ఇక్కడ పడిపోయింది.

తుక్కుతుక్కుగా నలిగిపోయిన పూలచెండులాగా, అడవి ఏనుగులు త్రొక్కి పాడుచేసిన పూల తోటలాగా, నిట్టాడు జారి కప్పుకూలిపోయిన గుడిశలాగా వున్న ఆ కనకాల్ను చూస్తుంటే ఎల్లయ్యకు రకరకాలు భావాలు కలిగాయి.

"నిన్నటాల వానలో కొట్టుకుపోయిన నా దేవుడ్ని సూచి నవ్వి ఎగతాళి సేసావు కదే? ఇప్పుడు సూడు మళ్ళీ ఎట్టా కళకళ్ళాడిపోతూన్నడో! నా దేముడు నేను ఎప్పుడు గీసినా, ఎప్పుడు సూసినా, ఎన్నేళ్లు గడిసినా ఇట్టాగే వుంటాడు. ఇట్టాగే అందంతో మెరిసిపోతాడు. మరి నీవ్వో! నీ వంట్లో ఆ అందం బిగీజిగీ నాల్గునాళ్ళే వుంటది, ఆ తర్వాత నీవంట్లో సత్తువంతా పోతది.... నీ అందం నీసందం పోతది! ఇదిగో ఇయ్యాళ అయిందే అట్టా, అందరూ నీ సత్తువ నాగేత్తారు- నీ అందం సెరిసేత్తారు. అప్పుడు కుక్కలు చింపిన ఇస్తరవుతుంది నీ బతుకు. కాని, నా దేముడు ఎప్పుడూ ఇట్లాగే వుంటాడు. ఆయన్ని సూసి అందరూ దణ్ణాలు పెట్టుతూనే వుంటారు-"

కనకాలు వెక్కి వెక్కి ఏడుస్తూంది.

"ఇప్పుడు సెప్పవే కనకాలు! మూణ్ణాళ్ళ పండుగలాంటి నీ అందం, నీ వళ్ళూ గొప్పా! లేక నా దేముడు గొప్పా? నేనెవర్ని నమ్ముకోవాలి- సెప్పవే?"

కనకాలు కన్నీరుమున్నీరుగా ఏడుస్తూ - "ఆయనే గొప్ప! ఆయనే గొప్ప! ఆయన్నే నమ్ముకోవాలి!" అంటూ ఏడుకొండలవాడి పాదాలమీద వాలిపోయింది.

- ప్రభవ మాసపత్రిక

★